క్లుప్తంగా

పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని ధర్నా



నిజామాబాద్ అర్బన్ : నగరంలోని హమాల్ వాడి దారుగల్లీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. శనివారం పాఠశాలలో పీడీఎస్‌యు ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. వర్షం పడితే బడి ఆవరణలో నీరు నిలిచి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వంద మందికి పైగా విద్యార్థులకు రెండు బాత్‌రూంలు మాత్రమే ఉన్నాయన్నారు. నాయకులు మనోజ్, భరత్, అనిల్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌భవన్ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం



నిజామాబాద్‌అర్బన్ : నగరంలోని కోటగల్లీ(శంకర్‌భవన్) ప్రాథమిక పాఠశాలలో శనివారం హెచ్‌ఎం రామచందర్ గైక్వాడ్ అధ్యక్షతన తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. విద్యార్థుల చదువు పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలన్నారు. ఉపాధ్యాయులు దయానంద్, సుజాత, సరిత, మమత, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాంల పంపిణీ



నిజామాబాద్‌అర్బన్ : నగరంలోని నాగారం 300 క్వార్టర్స్‌లోని ఖలీల్‌వాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం మేయర్ దండు నీతూకిరణ్ శేఖర్ విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం వాసుదేవరావు, శంకర్ భవన్ పాఠశాల హెచ్‌ఎం రామచందర్ గైక్వాడ్, ఉపాధ్యాయులు గంగాధర్, మురళి, కిషన్ పాల్గొన్నారు.

మానవత్వం చాటిన సేవా సమితి సభ్యులు



నిజామాబాద్ నాగారం : అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడిని ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు ఇందూర్ యువత స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు. నగరంలోని గంజ్ ప్రాంతంలో ఓ అనాథ వృద్ధుడు కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కదలలేని స్థితిలో ఉన్న ఆయనను ఇందూరు యువత సభ్యులు శనివారం పోలీసుల సహకారంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంస్థ వ్యవస్థాపకుడు మద్దుకూరి సాయిబాబు, కార్యదర్శి జయదేవ్ పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం



డిచ్‌పల్లి : మండలంలోని ధర్మారం(బి)గ్రామంలో శనివారం అమ్మ మాట – అంగన్వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో స్వర్ణలత ఆధ్వర్యంలో పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. పిల్లలతో కలిసి ర్యాలీ నిర్వహించి వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీప్రియ, అంగన్వాడీ టీచర్ ఎడవెల్లి జ్యోతి సోమనాథ్ పాల్గొన్నారు.

ఫ్రీజర్ అందజేత



మోపాల్: మండల కేంద్రంలోని గ్రామాభివృద్ధి కమిటీకి లయన్స్ సహారా ఆధ్వర్యంలో శనివారం ఫ్రీజర్ బాక్స్ (శీతల శవ పేటిక) అందజేశారు. జిల్లా కార్యదర్శి లయన్ ఉదయ సూర్య భగవాన్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవాభావాన్ని కలిగి ఉండాలని సూచించారు. లయన్స్ ఇంటర్నేషనల్ చేస్తున్న సేవలను వివరించారు. గ్రామంలో గ్రంథాలయం లేదని వీడీసీ ప్రతినిధులు వారి దృష్టికి తీసుకురాగా, లయన్స్ తరపున పుస్తకాలు, ఫ్యాన్లు అందజేస్తామని ప్రతినిధులు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు నర్సింహారావు, ధనుంజయ్‌రెడ్డి, ఫ్రీజర్ బాక్స్ దాత లక్‌పతిరెడ్డి, వీడీసీ చైర్మన్ గాదె జనార్దన్, కుర్మ చిన్నయ్య, గంగారాం, జక్కు గణపతి, గంగాధర్, గోవర్ధన్ పాల్గొన్నారు.

కుక్కల బెడదకు చెక్!

- చర్యలు చేపట్టిన కార్పొరేషన్ అధికారులు
- రూ.57 లక్షల నిధులు కేటాయింపు
- రెండు టీమ్‌లతో డాగ్‌స్క్వాడ్‌ల ఏర్పాటు
- శునకాలకు కు.ని. ఆపరేషన్లు చేయాలని నిర్ణయం



నిజామాబాద్ నాగారం : నగరంలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. శునకాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుక్కలు గుంపులుగా వస్తే చాలు వణికిపోతున్నారు. ఏ సమయంలో ఎటు నుంచి వచ్చి కుక్కలు దాడి చేస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో కుక్కల బెడద నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కొన్నేళ్లుగా శునకాలకు కుటుంబ నియంత్రణ కోసం మున్సిపల్ అధికారులు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయిస్తున్నారు. ఆపరేషన్లు చేస్తున్నా.. ఫలితాలు అంతంత మాత్రంగానే వస్తున్నాయి. దీంతో ఈ ఏడాది ప్రత్యేకంగా రూ. 57లక్షల నిధులు కేటాయించారు. కుక్కల బెడద ఉంటే ఫోన్ చేయడానికి కంట్రోల్ రూం (08462–220234) ఏర్పాటు చేశారు.

నిధుల గోల్‌మాల్‌పై నిరసనలు

నగరంలో కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం ఏటా రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు నిధులు కేటాయిస్తున్నారు. ప్రతి ఏడాది 600 నుంచి 800వరకు కుక్కలకు ఆపరేషన్లు చేసినట్లు చెబుతున్నారు. ఐదేళ్లుగా సుమారు 3వేలకు పైగా కుక్కలకు ఆపరేషన్లు చేయించామని లెక్కలు చెబుతున్నాయి. అయినా కుక్కల బెడద మాత్రం తగ్గడం లేదు. దీనిపై పలువురు కార్పొరేటర్లు కుక్కల నిధులు గోల్‌మాల్ చేశారంటు బడ్జెట్, కౌన్సిల్ సమావేశాల్లో నిరసన తెలిపిన విషయం తెలిసిందే.

ఎక్కడ చూసినా కుక్కలే..

నిజామాబాద్ కార్పొరేషన్‌లో 60 డివిజన్లు ఉన్నాయి. సుమారు 3.90 లక్షల జనాభా ఉంది. నగరంలో ఎక్కడ చూసినా కుక్కలే దర్శనమిస్తున్నాయి. దీంతో నగరంలోని ప్రజలు ఇబ్బందులు పడుతునే ఉన్నారు. ఎక్కడో ఓ చోట నిత్యం కుక్కల దాడిలో గాయపడిన ఘటనలు చోటు చేసుకుంటునే ఉంటున్నాయి.

ఫోన్ చేస్తే చాలు..

నగర పరిధిలో కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయ డానికి మున్సిపల్ బడ్జెట్‌లో రూ. 57లక్షల నిధులు కేటాయించారు. ఈ నిధులతో డీఆర్‌సీ సెంటర్ ఏ ర్పాటు చేశారు. ప్రత్యేకంగా రెండు డాగ్ స్క్వాడ్ బృందాలను రప్పించారు. రెండు టీమ్‌లు గల్లీలో తిరుగుతూ కుక్కలను పట్టుకొని వస్తాయి. ఒక్కో బృందం సభ్యులు సుమారు 15 కుక్కలను అంటే రోజుకు 30 కుక్కలను పట్టుకొని వస్తారు. కుక్కల బెడద ఎక్కువగా ఉన్న ప్రాంతానికి ముందు వెళ్లనున్నారు. కంట్రోల్ రూమ్‌నంబర్‌కు ఫోన్ చేస్తే చాలు గల్లీకి వచ్చి పట్టుకెళ్లతారు. నగరంలోని డీఆర్‌సీ సెంటర్‌లో కుక్కలకు మూడు రోజులకు ఒక్కసారి ప్రత్యేకంగా డాక్టర్ ద్వారా ఆపరేషన్లు చేస్తారు. ఆడ కుక్కలకు గర్భాశయం తీసేస్తారు. మగ కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేస్తారు. కుక్కలు పట్టుకు రావడానికి, ఫుడ్, మందులు, ఇతర ఖర్చులకు ఒక్కో కుక్కకు రూ.1,650 చొప్పున చెల్లిస్తారు. ఆపరేషన్ చేసిన తర్వాత మూడు రోజులకు తీసుకొచ్చిన ప్రాంతంలోనే మళ్లీ కుక్కలను వదిలేస్తారు.

అన్ని ఏర్పాట్లు చేశాం

కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం ఈ ఏడాది మున్సిపల్ కమిషన్ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేశాం. కుక్కలను పట్టుక రావడానికి ప్రత్యేకంగా రెండు టీమ్‌లు పని చేస్తాయి. కుక్కడ బెడద ఉంటే కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయాలి.

– సాజిత్‌అలీ, ఇన్‌చార్జి ఎంహెచ్‌వో

నేటి చిత్రం..



ఆర్యనగర్ షిర్డిసాయికాలనీలో రోడ్డుపై నిలిచిన నీరు

రోడ్డు ఇలా.. నడిచేదెలా?

నగరంలోని ఐదో డివిజన్ ఆర్యనగర్ షిర్డి సాయికాలనీలో రోడ్డుపై వర్షపు నీరు నిలిచి బురదమయంగా మారింది. దీంతో ఆ మార్గంలో వెళ్లడానికి వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలి



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

ఇందల్వాయి : బడ్జెట్‌లో విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు ప్రిన్స్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ధర్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ విద్యార్థులతో కలిసి ఎంఈవోకు వినతి పత్రాన్ని అందజేశారు. విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు వంశీ, షాబాజ్, నాయక్ ఉన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులు పూర్తి చేయాలి



మొక్క నాటుతున్న స్పెషల్ ఆఫీసర్

మోపాల్ : మండలంలో పాఠశాలల్లో చేపడుతున్న అమ్మ ఆదర్శ పనులను నాణ్యతతో వీలైనంత త్వరగా పూర్తి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ సురేష్‌కుమార్ సూచించారు. శనివారం నగర శివారులోని బోర్గాం(పి) జెడ్పీహెచ్‌ఎస్, కాస్‌బాగ్ తండాల్లో పాఠశాలల్లో పనులను ఆయన పరిశీలించారు. ఇంకా చేపట్టాల్సిన పనుల గురించి పీఆర్ ఏఈ స్రవంతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సురేష్‌కుమార్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పనుల్లో జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు నిత్యం పర్యవేక్షించాలని, కాంట్రాక్టర్లతో పనులు చేయించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించినట్లు తన దృష్టికి వస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. అంతకుముందు బోర్గాం(పి) జెడ్పీహెచ్‌ఎస్‌లో స్పెషల్ ఆఫీసర్, గ్రామాభివృద్ధి కమిటీ, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు మొక్కలు నాటారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి ఇంట్లో స్టడీ కార్నర్ ఏర్పాటు చేయాలని హెచ్‌ఎం శంకర్ సూచించారు. వీడీసీ చైర్మన్ శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెయూలో గురుపౌర్ణమి వేడుకలు



తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో విద్యార్థులు శనివారం ముందస్తు గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు గురువులు ఆంజనేయులు, అపర్ణ, వాణి, కైసర్ మహమ్మద్, రాజేశ్వరి, కిరణ్‌ను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రొఫెసర్లు ఆకాంక్షించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



అభ్యర్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నిజామాబాద్‌రూరల్ : న్యాక్ సెంటర్‌లో ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సూచించారు. రూరల్ పరిధిలో ఉన్న న్యాక్ సెంటర్‌ను శనివారం ఆయన సందర్శించారు. అక్కడ శిక్షణ పొందుతున్న యువతతో మాట్లాడారు. ఈ కేంద్రంలో ఉచిత శిక్షణతో పాటు విదేశాల్లో ఉద్యోగాల కల్పన, మూడు నెలల ట్రెనింగ్‌లో స్టైఫండ్ ఇస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, నాయకులు ప్రవీణ్, కార్వ రాజేంద్రప్రసాద్, న్యాక్ సెంటర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం



మోపాల్ : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగమే విద్యా కమిషన్ ఏర్పాటు, ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ అని డీసీసీబీ డైరెక్టర్ గొర్కంటి లింగన్న పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. విద్య ప్రాముఖ్యత తెలిసిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. విద్యావేత్తలతో చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో అమరుల ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని పేర్కొన్నారు.

ముస్సిపల్‌లో పలువురికి బదిలీలు

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పలువురికి బదిలీలు అయ్యాయి. జూనియర్ అకౌంటెంట్ రమేశ్ మెట్‌పల్లికి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ జయకుమార్ బోధన్‌కు, ఇన్‌చార్జి ఎంహెచ్‌వో ఆదిలాబాద్‌కు బదిలీ అయ్యారు. తొమ్మిది మంది సీనియర్ అసిస్టెంట్‌లు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఆదిలాబాద్ మున్సిపల్‌లో పని చేస్తున్న సీనియర్ అకౌంటెంట్ ప్రవీణ్ ఇక్కడికి రానున్నారు. ఆర్మూర్ నుంచి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మహేశ్ నిజామాబాద్‌కు వస్తున్నారు.

నగరంలో మున్సిపల్ కమిషనర్ పర్యటన



నిజామాబాద్‌నాగారం: మున్సిపల్ కమిషనర్ మకరందు శనివారం నగరంలో పర్యటించారు. వర్షం నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. సూపరింటెండెంట్ ప్రకాష్ ఖానాపూర్ ప్రాంతంలో పరిశీలించారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

నిజామాబాద్‌రూరల్: మండలంలోని మల్కాపూర్ శివారులో గల దత్త నిర్మలాశ్రమాలయంలో ఆదివారం గురుపౌర్ణమి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పంచామృతాభిషేకం, గురుచరిత్ర పారాయణం, శ్రీగురుపూజ, మహానైవేద్యం ఉంటాయని శ్రీకాంత్‌శర్మ తెలిపారు.

మున్సిపల్ విభాగాలపై కమిషనర్ నిఘా

- కార్మికుల విధుల పర్యవేక్షణకు జోన్‌లకు ప్రత్యేకాధికారుల నియామకం

నిజామాబాద్‌నాగారం : మున్సిపల్ కమిషనర్ మంద మకరందు మున్సిపల్‌లో ఒక్కో విభాగంపై ప్రత్యేక నిఘా పెడుతున్నారు. ఆయా విభాగాల్లో ఏం జరుగుతుంది. ప్రజలుకు ఎలాంటి సేవలు అందుతున్నాయో పరిశీలన చేస్తున్నారు. ఇప్పటికే శానిటేషన్ పాలన గాడిన పెట్టేందుకు ప్రత్యేక అధికారులతో తనిఖీలు చేపట్టి పూర్తి ఆధారాలు తెప్పించుకున్నారు. తాజాగా ఇంజినీరింగ్ సెక్షన్‌లో ఎంతమంది ఉద్యోగులు, కార్మికులు విధులకు హాజరు అవుతున్నారు, పనులు ఏవిధంగా చేస్తున్నారో ఆరా తీయడానికి ప్రత్యేక అధికారులను నియమించారు. ఈ నెల 22 నుంచి 10 రోజుల పాటు ఆయా జోన్‌లలో ప్రత్యేక అధికారులు తనిఖీలు చేపట్టి కమిషనర్‌కు నివేదిక అందజేయనున్నారు.

ప్రత్యేకాధికారుల వివరాలు..

జోన్	అధికారి
1	ఎన్ శంకర్, అడిషనల్ కమిషనర్
2	మురళి మోహన్‌రెడ్డి, ఇంజినీరింగ్ సెక్షన్ ఈఈ
3	జి రాజేంద్రకుమార్, డిప్యూటీ కమిషనర్
4	జి జనార్దన్, సూపరింటెండెంట్
5	డి నరేందర్, సూపరింటెండెంట్

బీఎల్ సంతోష్‌ను కలిసిన ఎమ్మెల్యేలు



సుభాష్‌నగర్ : బీజేపీ జాతీయ సంఘటన ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌ను నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, పార్టీ నిజామాబాద్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి, మోరెపల్లి సత్యనారాయణ శనివారం ఢిల్లీలో కలిశారు. ఈసందర్భంగా నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో పార్టీ పటిష్టత, భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాలు, ప్రస్తుత రాజకీయ అంశాలపై చర్చించారు. రాబోయే స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికతో పార్టీ కార్యక్రమాలు చేపట్టాలని బీఎల్ సంతోష్ సూచించారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	74,300	వెండి (కిలో)	93,000
22 క్యారెట్స్	68,542		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	48	70	గాజరుగడ్డ	30	50
బెండకాయ	15	30	పచ్చిమిర్చి	30	50
జీరకాయ	20	40	దోసకాయ	15	30
దొండకాయ	12	24	ఆలుగడ్డ	30	50
జిర్నిసుకాయ	60	90	గోబిగడ్డ	35	50
కాకరకాయ	40	60	గోబిపువ్వు	30	50
వంకాయ	20	40	బీట్‌రూట్	30	50
పాలకూర	15	30	కరివేపాకు	40	60
మెంతికూర	40	60	చామగడ్డ	35	50
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	40	60
పుదీనా	50	75	చిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	50	75			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	కల్కి-2898 2డీ(తెలుగు) - 1.00, 7.25
స్క్రీన్-2	భారతీయుడు-2(తెలుగు) -10.20 కల్కి-2898 2డీ(తెలుగు) -4.10, 10.40 - డార్లింగ్(తెలుగు)-1.15
స్క్రీన్-3	కల్కి-2898 2డీ(తెలుగు) -10.20 భారతీయుడు-2(తెలుగు)-1.45,10.45 డార్లింగ్(తెలుగు)-7.50

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	కల్కి-2898 ఏడీ(3డీ తెలుగు)-11.00,6.30 కల్కి-2898 ఏడీ(హిందీ)-2.45 ట్విస్టర్స్(ఇంగ్లీష్)-10.15
స్క్రీన్-2	బాడ్‌న్యూస్(హిందీ)-10.45, 1.50,7.25,10.30 కిల్(హిందీ)- 4.55
స్క్రీన్-3	ట్విస్టర్స్(ఇంగ్లీష్)-10.15 డార్లింగ్(తెలుగు)-1.05,7.00,10.20 జెస్ట్ ఏ మినిట్(తెలుగు)- 4.25
స్క్రీన్-4	డార్లింగ్(తెలుగు)-10.40 ట్విస్టర్స్(ఇంగ్లీష్)-2.00 7.30 ది బర్త్‌డే బాయ్(తెలుగు)-4.50 పేక మేడలు(తెలుగు)-10.20
దేవి	భారతీయుడు-2 (తెలుగు)
నటరాజ్	క్రైమ్ రీల్ (తెలుగు)
విజయ్	కల్కి-2898 ఏడీ(తెలుగు)

ఆ వెంచర్‌కు అనుమతి లేదు

- ప్లాట్లు కొనొద్దని ఫ్లెక్సీ ఏర్పాటు



వెంచర్ వద్ద అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నిజామాబాద్‌నాగారం : నగరంలోని అర్సపల్లి ప్రాంతంలో బోధన్ రోడ్డులో సర్వే నంబర్‌లో 2870, 2871 ఏర్పాటు చేసిన లే అవుట్‌కు అనుమతులు లేవని కమిషనర్ మకరందు తెలిపారు. వెంచర్‌లో ప్లాట్లు కొనొద్దని శనివారం ఎన్‌ఆర్ఐ కాలనీ గేటుకు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఎన్‌ఆర్ఐ కాలనీలో అక్రమ వెంచర్లు అని గతంలో సాక్షి పత్రికలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ ఖైసర్ ఫిర్యాదు చేశారు. దీంతో కమిషనర్ టౌన్‌ప్లానింగ్ అధికారులతో విచారణ చేయించారు. అనంతరం అనుమతులు లేవని గుర్తించి ప్లాట్లు కొనవద్దని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

సిరికొండ : సిరికొండతో పాటు కొండాపూర్‌లోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవం శనివారం నిర్వహించారు. సిరికొండ శాఖ ఆధ్వర్యంలో కొండూర్ ప్రభుత్వ పాఠశాలలో, కొండాపూర్ శాఖ ఆధ్వర్యంలో తూంపల్లి పాఠశాలలో విద్యార్థులకు ప్యాడ్లు, క్రేయాన్స్, డ్రాయింగ్ కిట్స్ పంపిణీ చేశారు. మేనేజర్లు జయప్రకాష్, మల్లేష్, సుధాకర్, నరేష్, రాజన్న పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి





మోడల్ స్కూల్‌లో భోజనం పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి, తొర్లికొండ హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ధర్పల్లి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రత్యేకాధికారి శ్రీనివాస్ సూచించారు. ధర్పల్లిలోని మోడల్ స్కూల్‌ని శనివారం ఆయన తనిఖీ చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఎంపీడీవో బాలకృష్ణ, పీఎస్ సైఫొద్దీన్ ఉన్నారు.

తొర్లికొండ హాస్టల్ పరిశీలన

జక్రాన్‌పల్లి : మండలంలోని తొర్లికొండ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఎంపీడీవో సతీశ్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. కిచెన్ షెడ్, మరుగుదొడ్లను పరిశీలించారు. హాస్టల్‌కు మిషన్ భగీరథ నీరు రావడం లేదు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు. అప్పటి వరకు తాత్కాలిక ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వార్డెన్‌కు సూచించారు.

ఆధ్యాత్మికం..

శాకంబరి అలంకరణలో లలితాదేవి



నిజామాబాద్ అర్బన్ : ఆషాఢ మాసం పురస్కరించుకొని శనివారం నగరంలోని న్యాల్‌కల్ రోడ్డులో గల లలితాదేవి ఆశ్రమ ఆలయంలో అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు చేశారు.

ప్రారంభానికి సిద్ధమైన ఆలయం



సిరికొండ: మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామంలో నూతనంగా నిర్మించిన సాయి ఆలయాన్ని గురు పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం ప్రారంభిస్తున్నట్లు మాజీ సర్పంచ్ గంగాదాస్ తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో సాయినాథుని త్రిమూర్తి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.